క్లుప్తంగా

వైకుంఠ రథం అందజేత



మోర్తాడ్: భీమ్‌గల్ మండలంలోని పురాణిపేట్ గ్రామ పంచాయతీకి మార్గదర్శి స్వచ్ఛంద సంస్థ సభ్యులు సోమవారం వైకుంఠ రథం అందజేశారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే వారి అంతిమ యాత్రకు పొరుగు గ్రామాల వైకుంఠ రథంపై ఆధారపడాల్సి వస్తుండటంతో స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నారు. వైకుంఠ రథం గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



రుద్రూర్: మండల కేంద్రంలోని శ్రీరామ మందిర కాలనీలో నీటి సమస్యను పరిష్కరించడానికి జీపీ అధికారులు చర్యలు చేపట్టారు. 15 రోజులుగా నీటి కోసం అవస్థలు పడుతున్నామని స్థానికులు ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీ నాయక్, ఏఈ అజయ్ సోమవారం గ్రామానికి వచ్చి సమస్య తెలుసుకున్నారు. ఎల్లమ్మ గుడి సమీపంలో జీపీ సిబ్బంది చేస్తున్న పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిగా చేసి నీటి సరఫరా చేయాలని వారు సూచించారు.

నిధుల మంజూరుపై హర్షం



నందిపేట్ (ఆర్మూర్): నందిపేట్ మండలం సిద్ధాపూర్ గ్రామానికి నిధులు మంజూరు చేయడం పట్ల గ్రామ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి రూ.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు గ్రామ కమిటీ సభ్యులకు నిధులు మంజూరు చేసిన జీవో కాపీని అందజేశారు. నిధులను మంజూరు చేసినందుకు మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి, ఆర్మూర్ నాయకులు వినయ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాల సందర్శన



నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలను సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజ్ కుమార్‌ను కళాశాల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో తప్పకుండా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని నందిపేట్ కళాశాలకు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కళాశాల ఏవో తులసీరామ్, ఈసుబ్, అధ్యాపకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

మేడే వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో బీడీ కంపెనీ వద్ద టీయూసీఐ ఆధ్వర్యంలో మంగళవారం మేడే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న మాట్లాడుతూ.. దేశంలో 47 కోట్ల మంది శ్రమ జీవులలో 7 కోట్ల మందికే కనీస వేతనాలు అందుతున్నాయన్నారు. మిగతా 40 కోట్ల శ్రమ జీవులకు కనీస వేతనాలు అందడం లేదన్నారు. కనీసం జీవన భద్రత కూడ లేదన్నారు. నాయకులు మహ్మద్ నజీర్, నిమ్మల నిఖిల్, పండరి, గంగాధర్, మమత తదితరులు పాల్గొన్నారు.

అఖండ శివనామ సప్తాహం



రుద్రూర్: పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామ హన్మాన్ ఆలయంలో 19వ అఖండ శివనామ స ప్తాహం నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది గ్రామంలో శివనామ సప్తాహం నిర్వహిస్తున్నట్లు స్థానికులు వె ల్లడించారు. గ్రామస్తులు రాజేశ్వర్, నాగరాజ్, అర్జు న్ పటేల్, వీరేశం, హన్మంతు, రాంబాబు, రాజు, సాయిలు, యాదవ్ రావ్ పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో ఆర్టీవోలు

- ఏళ్లు గడిచినా సొంత గూడు కరువు
- ఏటా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతున్నా నిర్లక్ష్యమే
- కొత్త భవనాలకు కొలిక్కిరాని స్థలాల ఎంపిక



బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని నిజాంషుగర్ ఫ్యాక్టరీకి చెందిన పాత భవనంలో ఆర్టీవో ఆఫీస్(ఎంవీఐ)

బోధన్ : రాష్ట్ర ప్రభుత్వానికి అధిక మొత్తంలో ఆదాయం సమకూరే కీలక శాఖల్లో ఆర్టీవో(ఎంవీఐ) ఒకటి. ఈ శాఖ కార్యాలయాలు డివిజన్ కేంద్రాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఏళ్లు గడిచినా కొత్త భవనాల నిర్మాణం అడుగు ముందుకు పడటం లేదు. స్థల సమస్య కారణంగా కొత్త భవనాల నిర్మాణంలో కాలయాపన జరుగుతోందని స్పష్టమవుతుంది. బోధన్ ఆఫీస్ కోసం గతంలో బెల్లాల్ గ్రామ శివారులో నిజాంషుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం పరిధిలోని నాలుగు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలాన్ని మార్కెట్ ధర ప్రకారం డబ్బులు చెల్లించాలని ఫ్యాక్టరీ యాజమాన్యం తేల్చి చెప్పడంతో స్థల ప్రతిపాదన మూలన పడింది. ఆర్మూర్, బాన్సువాడ ఆఫీస్‌లకు సంబంధించి స్థలం ఎంపిక ప్రక్రియ, ప్రభుత్వ భూమి కేటాయింపు సమస్య కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. ఇటీవల రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్.. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు డివిజన్ కేంద్రాల్లో కొత్త భవనాల కోసం ప్రభుత్వ స్థల అవసరాన్ని తెలియజేస్తూ లేఖ పంపించినట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. దీంతో కొత్త భవనాల అంశం మళ్లీ చర్చకు వస్తోంది.

నెలకు రూ.80 లక్షల ఆదాయం..

ఆర్టీవో ఆఫీస్‌లకు ఏటా రూ.కోట్ల ఆదాయం సమకూరుతోంది. బోధన్ ఆఫీస్‌కు శాఖాపరంగా వచ్చే ఫీజులు, జరిమానాల రూపంలో నెలకు దాదాపు రూ.80 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఈ లెక్కన ఏటా రూ.కోట్లలో ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది. భారీ మొత్తంలో ఆదాయం సమకూరే ఆర్టీవో శాఖ పట్ల ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందో కొంత ఆశ్చర్యమేస్తోంది.

కనీస సౌకర్యాలు కరువు

ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో ఉన్న ఆఫీసులకు సొంత భవనాలుండగా, బోధన్, ఆర్మూర్ ఆఫీస్‌లు అద్దె భవనాల్లో, బాన్సువాడలో పీఆర్ శాఖ భవనంలో ఏర్పాటు చేశారు. బోధన్ పట్టణ కేంద్రంలోని శక్కర్‌నగర్‌లో నిజాంషుగర్ ఫ్యాక్టరీకి చెందిన శిథిలావస్థలో ఉన్న పాత భవనంలో అద్దెకు తీసుకొని కొనసాగిస్తున్నారు. అద్దె భవనాల్లో కనీస సౌకర్యాలు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరిగా సైంటిఫిక్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లు ఉండాలి. బోధన్‌లో ఆ ట్రాక్ ఏర్పాటుకు నోచుకోలేదు. ఆఫీస్ ఆవరణలోనే టెస్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. బోధన్ ఆఫీస్‌కు డివిజన్ పరిధిలోని బోధన్ అర్బన్, రూరల్, సాలూర, రుద్రూర్, పోతంగల్, కోటగిరి, వర్ని, చందూర్, మోస్రా, రెంజల్, ఎడపల్లి మండలాల నుంచి డ్రైవింగ్ లైసెన్స్‌లు, కొత్త వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ ధ్రువీకరణ కోసం వస్తారు. జిల్లా, డివిజన్ల పునర్విభజనకు పూర్వం బోధన్ పాత రెవెన్యూ డివిజన్‌లోని బోధన్, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలు బోధన్ ఆర్టీవో ఆఫీస్ పరిధిలో ఉండేవి. ప్రస్తుతం ఆ పరిధి తగ్గిపోయింది. విశ్రాంత గదుల సౌకర్యం లేక చెట్ల నీడలోనే కూర్చుంటున్నారు.

ప్రత్యేక దృష్టి సారించారు



కొత్త ఆఫీస్ భవనం నిర్మాణం విషయంలో ప్రభుత్వ స్థలం కోసం తమ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. తాను స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసి స్థల అవసరాన్ని తెలియజేయగా సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే కొత్త భవనం నిర్మాణానికి అడుగు ముందుకు పడుతుంది. – డి.శ్రీనివాస్, ఆర్టీవో(ఎంవీఐ), బోధన్

విద్యార్థి దశలో కష్టపడితే మంచి భవిష్యత్తు

- జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ కుమార్



రుద్రూర్‌లో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ కుమార్

రుద్రూర్ : విద్యార్థి దశలో కష్టపడి చదివితే భవిష్యత్తు బాగుంటుందని జిల్లా విద్యా శాఖాధికారి అశోక్ కుమార్ అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో రైడ్స్(రుద్రూర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ సొసైటి) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ తరగతులను సోమవారం డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల ప్రణాళికాబద్ధంగా చదివితే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని విద్యార్థులకు ఉద్బోధించారు. సబ్జెక్టుల్లో నిష్ణాతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛందంగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న రైడ్స్ బృందాన్ని అభినందించారు. రుద్రూర్, వర్ని ఎంఈవోలు కట్ట శ్రీనివాస్, దుర్కి సాయన్న, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి శ్యామల, రైడ్స్ అధ్యక్షుడు కృష్ణప్రసాద్, గౌరవ సలహాదారులు పత్తి రాము, కేవీ మోహన్, బెజుగం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలి



రెంజల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ముస్లిం పర్సనల్ లా బోర్డు ప్రతినిధులు

రెంజల్(బోధన్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, పహల్గాం టెర్రరిస్టులను పట్టుకుని ఉరి తీయాలని ముస్లిం పర్సనల్‌లా బోర్డు ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం బోర్డు ప్రతినిధులతో పాటు మండలంలోని ముస్లింలు సాటాపూర్ చౌరస్తాలో సమావేశమయ్యారు. అక్కడి నుంచి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ తహసీల్ కార్యాలయం వరకు పాదయాత్రగా తరలివచ్చారు. కార్యాలయం ముందు బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముస్లిం సమాజం ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తుందని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై చంద్రమోహన్‌కు అందించిన వినతిపత్రం ద్వారా తెలిపారు. ప్రతినిధులు మౌలానా ఖాలీద్‌బేగ్, అంజుంబేగ్, అబిద్‌బేగ్, మోసిన్‌బేగ్, హాజీఖాన్, ముఖీథ్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మాదిగ రిజర్వేషన్ విజయంపై సంబురాలు



సంబురాలు జరుపుకుంటున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణకు కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అభినందిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మాదిగ జేఏసీ నాయకుడు బర్కుంటశ్రీనివాస్, ఆర్మూర్ మాజీ కౌన్సిలర్ రింగుల భూషణ్, గంగాధర్ గైక్వాడ్, మల్లన్న, శివరాజ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

పసుపు విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పసుపు పరిశోధన స్థానంలో సోమవారం రైతులకు పసుపు విత్తనాలను పంపిణీ చేశారు. దుగ్గిరాల ఎరుపు, రాజేంద్ర సోనియా, బీఎస్‌ఆర్2, రాజాపురి, పులే స్వరూప తదితర రకాలను పంపిణీ చేయగా, జిల్లాతో పాటు, జగిత్యాల, నిర్మల్, వికారాబాద్ ప్రాంతాల నుంచి రైతులు వచ్చి తీసుకెళ్లారు. పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పదో తరగతి బ్యాచ్(2010- 11) విద్యార్థులు

మాక్లూర్: కల్లెడి ప్రభుత్వ పాఠశాలలో 2010- 11 సంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సోమవారం పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 14 సంవత్సరాల తరువాత కలుసుకున్న క్లాస్‌మేట్స్ ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. మంచి చెడులు అడిగి తెలుసుకున్నారు. చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. అనంతరం విందులో పాల్గొని ఆటపాటలతో సరదాగా గడిపారు.

నేడు బోధన్‌లో భూభారతిపై అవగాహన సమావేశం

బోధన్ : భూభారతి చట్టంపై అవగాహన సమావేశాన్ని మంగళవారం ఉదయం 9.30 గంటలకు పట్టణ కేంద్రంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆడిటోరియం హాల్‌లో ఏర్పాటు చేసినట్లు మండల రెవెన్యూ అధికారులు సోమవారం తెలిపారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పట్టణ, మండల రైతులు అధిక సంఖ్యలో సమావేశానికి హాజరుకావాలని కాంగ్రెస్ నాయకులు కోరారు.

చెరువు తూం మరమ్మతులు ప్రారంభం



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలోని బూరుకుంట్ల చెరువు తూం మరమ్మతు పనులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. తూముకు లీకేజీ సమస్య ఉండటంతో ప్రభుత్వం దృష్టికి తీసుకుపోగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిధులను మంజూరు చేయించారని నేతలు అన్నారు. ముందుగా నీటిని ఖాళీ చేసే పనులను ప్రారంభించినట్లు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నాయకులు ఆకుల పెద్ద రాజన్న, సాగర్, రిక్కల రాజన్న, గంగపుత్రులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు..



వేల్పూర్: పోచంపల్లిలో రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను వీడీసీ సభ్యులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గోజురు రాజేందర్, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, అలాల్ ముత్యం, ఆరె చిన్నయ్య, చంటి ప్రవీణ్, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిపించాలి

ఆర్మూర్‌టౌన్: ఆస్తుల పంపకాల విషయంలో తమకు న్యాయం జరిపించాలని ఆర్మూర్ మండలం అంకాపూర్‌కు చెందిన అంటి సాహితి అధికారులను కోరారు. ఆర్మూర్‌లోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తన భర్త శ్రీకాంత్, మరిది శ్రీధర్‌కు వారసత్వంగా వస్తున్న ఆస్తుల పంపకాల విషయంలో వీడీసీ జోక్యం చేసుకుని ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శివలింగానికి పంచామృతాలతో భక్తులు అభిషేకం నిర్వహించి, రామాయలం, అయ్యప్ప ఆలయం, దుర్గామాత, హనుమాన్ ఆలయాలను సందర్శించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలకు నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు బి. సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, కొంతం మురళి తదితరులు పాల్గొన్నారు.



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం



గుత్పలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు



మెండోరాలో.. కాంగ్రెస్ నాయకులు



ముప్కాల్ మండల కేంద్రంలో..

మాక్లూర్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ గుత్ప గ్రామంలో ఎన్ఎస్‌యూఐ ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షుడు బాశెట్టి శశి కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. నేతలు సాగర్, త్రీనేష్, శివ, స్వామి, అజ్జు, రాములు, మనోజ్, రుపేష్, హరీష్, చేతన్, చిక్కు, గణేష్, సన్నీ, నిఖిల్, సిద్ధు పాల్గొన్నారు.

పహల్గామ్ మృతులకు ఘన నివాళులు..

బాల్కొండ: పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల్లో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. పార్టీ మండలాల అధ్యక్షులు మగ్గిడి ముత్యంరెడ్డి, కొత్తింటి ముత్యంరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ జైడి రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి అంకితమై పని చేయాలి



మాట్లాడుతున్న మారంపల్లి గంగాధర్

పెర్కిట్(ఆర్మూర్): బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీకి అంకితమై పని చేయాలని ఆలూర్ మండల బీజేపీ ప్రభారి మారంపల్లి గంగాధర్ పిలుపునిచ్చారు. ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం పార్టీ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతానికి నిబద్ధతతో కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు సుర శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు కొత్తూర్ గిరీష్, నాయకులు అరుణ్, సుభాష్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు ప్రారంభించాలని రైతుల ఆందోళన



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

మాక్లూర్: అడవి మామిడిపల్లి, గుత్ప గ్రామాలలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు కొనుగోళ్ల ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ రెండు గ్రామాల రైతులు సోమవారం వేర్వేరుగా 63వ నంబర్ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. డీసీవో డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో లారీలు ఉంటే లేబర్లు లేరని, లేబర్లు ఉంటే లారీలు లేవని, ఈ రెండు ఉన్నచోట ఖాళీ సంచులు, సుతిలీళ్లు లేవని ఆగ్రహిస్తూ సుమారు అరగంటకు పైగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రారంభంలో ఐకేపీ ద్వారా కాంటాలు జరిగి 4 లారీల ధాన్యం తీసుకెళ్లారని అన్నారు. తదనంతరం సొసైటీ ద్వారా కొనుగోలు జరుపుతామని చెప్పి ఐకేపీ సెంటర్‌ను తొలగించారన్నారు. ఒక వైపు వండగళ్ల వర్షాలు ఆందోళన చెందుతున్నామన్నారు. ఈ విషయమై సొసైటీ చైర్మన్, డీసీవో ఈ ఇద్దరిలో ఎవరికి ఫోన్ చేసినా ఎత్తడం లేదని మండిపడ్డారు. కలెక్టర్ కల్పించుకుని కాంటాల వేగం పెంచి ధాన్యాన్ని వెను వెంటనే రైస్‌మిల్లుకు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పోలీసులు జోక్యం చేసుకుని ధర్నా విరమింపజేశారు.

వీరశైవ ధర్మ సంప్రదాయం సర్వశ్రేష్ఠం



భజనలు చేస్తున్న వీరశైవ లింగాయత్ సమాజ్ మహిళలు, కళాకారులు



ప్రవచనాలు చేస్తున్న శంకర్ లింగ్ శివాచార్య

- శంకర్ లింగ్ శివాచార్య మహరాజ్

బోధన్: మానవీయ విలువలు కలిగిన వీరశైవ ధర్మ సంప్రదాయం సర్వశ్రేష్ఠమైందని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో ఆచరించాలని మహారాష్ట్ర ప్రాంతంలోని హనేగాంకు చెందిన వీరశైవుల ఆరాధ్య గురువు సద్గురు శంకర్ లింగ్ శివాచార్య మహరాజ్ ప్రబోధించారు. ఆధ్యాత్మిక జీవన విధానంతోనే మానసిక ప్రశాంతత ప్రాప్తిస్తోందన్నారు. వీరశైవులు మెడలో ధరించే ఇష్ట లింగాన్ని నిత్యం పూజించాలని, శివనామస్మరణ చేయాలన్నారు. కన్నతల్లిదండ్రులు, గురువులను ఆరాధించాలన్నారు. వీరశైవ లింగాయత్ సమాజ్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన 6వ అఖండ శివనామ సప్తాహం సోమవారం 5వ రోజు కొనసాగింది. సప్తాహం శిబిరానికి విచ్చేసిన వీరశైవుల గురువు భక్తుల నుద్దేశించి ప్రవచనాలు చేశారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	ఏఎల్‌సీసీ(ఓ యూనివర్సల్ బ్యాచిలర్)- 11.00, అర్జున్ సన్నాఫ్ వైజయంతి-1.35, 7.25, సోదరా-4.35, సూర్యాపేట జంక్షన్-10.25
స్క్రీన్-2	మన ఇద్దరి ప్రేమకథ-10.50, నె జహా-2 (తెలుగు)-1.15, 4.20,7.20,తుదరుమ్ -10.20
స్క్రీన్-3	సారంగపాణి జాతకం-11.10, 2.00, 4.50, 7.40, 10.30
స్క్రీన్-4	జింఖానా-11.30, 7.35, 10.30, చౌర్య పాఠం-2.25, శివ శంభో-5.05



మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,000	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	90,465		

- నిజామాబాద్ బిజినెస్